క్లుప్తంగా

చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్



మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణను కలిసిన కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ శ్రీవిద్య శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణను ఆమె స్వగృహంలో కలుసుకున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు

సామర్లకోట: మున్సిపల్ పాలక మండలికి చెందిన సాధారణ, అత్యవసర సమావేశాలు శనివారం జరుగుతాయని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. అనంతరం అత్యవసర సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ బొద్దు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

సామర్లకోట: సభ్యత్వాల నమోదుపై బీజేపీ కార్యకర్తల సమావేశం స్థానిక సంపెంగ తోటలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టరు గౌరకపూడి చిన్నయ్యదొర కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. స్థానిక బొద్దు భాస్కర రామారావు మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తెల్లవారుజామున ఐదింటికి లేచి గంటపాటు చదువుకోవాలని సూచించారు. ముందుగానే ఇళ్ల వద్ద చదివి రావడం వలన ఉపాధ్యాయులు చెప్పే అంశాలు పూర్తిగా అర్థమవుతాయన్నారు. ఉపాధ్యాయులు బోధించే సమయంలో శ్రద్ధగా ఆలకించి, అనుమానాలను వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహభావంతో మెలిగి, వారిలో చదువుపై ఆసక్తి పెంచాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. హెచ్‌ఎం లలితాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండున సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ జాబ్ మేళాలో క్యాపిటల్ ట్రస్ట్ లిమిటెడ్‌లో బీఎం, బిక్యూఎం, ఆర్ఓ, ఐఆర్ఈపీ క్రికెట్ క్యాపిటల్‌లో సేల్ ఆఫీసర్, సీనియర్ సేల్స్ ఆఫీసర్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్, రివ్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హెల్పర్, ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ 2023, 2024 పాస్ అవుట్) ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 2వ తేదీ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరుకావాలని తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు ఎనిమిది సమస్యలు

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో జిల్లాకు సంబంధించి 8 సమస్యలపై ప్రజలు డీఎం ఎంవీ మనోహర్‌కు విన్నవించారు. స్థానిక అద్దరిపేటకు వెళ్లే బస్సులు వాకలపూడి మీదుగా తిప్పాలని, కాకినాడ, రాజమహేంద్రవరం వయా రాజానగరం రూటులో కొత్త బస్సులు వేయాలని, కాకినాడ బస్ స్టేషన్‌లో వాష్ రూమ్స్ పరిశుభ్రంగా ఉంచాలని, అద్దరిపేట బస్సును కల్పనా సెంటర్లో ఉదయం 8 గంటలకు నడిపితే ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందని తదితర సమస్యలను డీఎంకు వివరించారు. ద్రాక్షారామ నుంచి చర్ల వయా భద్రాచలం మీదుగా తిరిగే బస్సును, కాకినాడ నుంచి ఎస్ తిమ్మాపురం బస్సును పునరుద్ధరించాలని కోరా రు. ఎస్పీ ఆఫీసు వద్ద నుంచి కాకినాడ డిపోకు వచ్చే బస్సులు భానుగుడి సెంటర్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లాలని కోరారు.



దుర్గాడ శివాలయంలో చేస్తున్న సామూహిక వ్రతాలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ప్రారంభించిన ఈఓ నీలకంఠం తదితరులు



సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



తిరుపతి శృంగార వల్లభుడి ఆలయంలో వ్రతాలు



పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో వ్రతాలాచరిస్తున్న మహిళలు

ఆలయాల్లో శ్రావణ శోభ

- అపర్ణాదేవికి శ్రావణ శుక్రవారం పూజలు
- పాదగయ, దుర్గాడ శివాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: శ్రావణమాసం చివరి శుక్రవారం ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో పాదగయ కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో మహిళలు, భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరీ అమ్మవార్ల సన్నిధిలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.. అనంతరం దేవాలయంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాను భక్తులు సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఎక్కువగా తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీ దేవి ప్రతిరూపాలైన కలశాలను ప్రత్యేక మంటపాల్లో ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొల్లప్రోలు మండలంలో..

శ్రావణ శుక్రవారం సందర్భంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణాదేవి అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆలయ అర్చకులు అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించగా, పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాడ శివాలయంలో వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు,దత్తు సోదరులు.. మహాగణపతి పూజ, కలశ స్థాపన, లలితా సహస్రనామాలతో, లక్ష్మీ అష్టోత్తరాలతో తోర గ్రంధి పూజ జరిపించారు.. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు.. వరలక్ష్మీ దేవి ప్రీతికరమైన చారుమతీ దేవి వ్రత కథనాన్ని పాలకొల్లుకు చెందిన గణపతి శర్మ భక్తులకు వివరించారు.

పంచారామ క్షేత్రంలో..

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహిళలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఆలయంలో ఏటా శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నారు. ఈ శ్రావణ మాసంలో మొదటి, మూడు, నాలుగో శుక్రవారాల్లో పంచారామ క్షేత్రంలో మహిళలు సామూహిక వ్రతాలు చేసుకునే విధంగా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. వ్రతాల్లో పాల్గొనే మహిళలు బియ్యం, కలశం మాత్రమే తీసుకురాగా, వ్రతాలకు కావలసిన వరలక్ష్మీ రూపు, తోరాలు, లక్ష్మీదేవి ఫొటో, గాజులు, పువ్వులు, ప్లేటు, ప్రమిదలు, వత్తులు, నూనె, ప్రసాదం, జాకెట్ ముక్కలను దేవస్థానం అందజేసింది. ఆలయం తొలి అంతస్తు ప్రాకారం చుట్టూ వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతాలను ఈఓ భళ్ల నీలకంఠం, భక్త సంఘ నాయకులు కంటే బాబు సామూహిక వ్రతాలను ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి, అళ్లక్కి రాజగోపాల్, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, చెరుకూరి రాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 600 మంది మహిళలు సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ వారంతో ఆలయంలో మూడు శుక్రవారాల్లో ఏర్పాటు చేసిన సామూహిక వ్రతాలు ముగిశాయని ఈఓ తెలిపారు. సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్త సంఘం నాయకులు తలుపుల అంజనీకుమార్, మలిరెడ్డి శ్రీనివాసు, మద్దాలి శ్రీను సేవలందించారు. బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలోను, వేట్లపాలెం కనక దుర్గ ఆలయంలోను సామూహిక వ్రతాలు చేశారు.

భక్తులతో ఆలయాల కిటకిట

కొత్తపల్లి: మండలంలోని అమ్మవారి ఆలయాలు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలను నిర్వహించారు. అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలో ఉన్న బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరంతో పాటు, పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, కొత్తపల్లిలో ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరి రాజేశ్వరి స్వామి ఆలయం, ఉప్పాడ, గోర్స, మూలపేట, యండపల్లిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతాలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆఖరి శ్రావణ శుక్రవారం కావడంతో కనకదుర్గ, వనదుర్గ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది మహిళలు సామూహిక వ్రతాలు చేశారు. ఈఓతో పాటు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి మహిళలకు బంగారు తాపడం రూపులు, పూజా సామగ్రిని పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది.

మరిడమ్మ అమ్మవారి ఆలయంలో..

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈఓ సీహెచ్.రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో రెండు వేల మంది సామూహిక వరలక్ష్మీ వ్రతాలాచరించారు. ఈఓ, చైర్మన్లు భక్తులకు బంగారు తాపడం రూపులు, పూజా సామగ్రిని పంపిణీ చేశారు. స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరీ పీఠంలో వరలక్ష్మీ వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులు వ్రతాలు ఆచరించారు.



గాజుల అలంకారంలో అపర్ణాదేవి అమ్మవారు



గాజుల అలంకారంలో అపర్ణాదేవి అమ్మవారు



యండపల్లిలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

సమోసాలు తిని పోతున్నాం..

- అధికారుల తీరు మారడం లేదంటూ కౌన్సిల్ సభ్యుల మండిపాటు
- గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: కౌన్సిలర్లు 20 మంది వస్తున్నాం, సమోసాలు తింటున్నాం, వెళ్లిపోతున్నాం. అధికారులను ఏమైనా అడిగితే.. వారేదో సమాధానం చెబుతున్నారు. ప్రజలు రోగాలతో అల్లాడుతున్నా.. మున్సిపల్ అధికారుల్లో మార్పు రావడం లేదు..? అంటూ పలువురు కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. మనుషుల కంటే గొల్లప్రోలు నగర పంచాయతీలో కుక్కలే ఎక్కువగా ఉన్నాయని, వాటి దాడిలో పలువురు ఆస్పత్రుల పాలవుతున్నా, ప్రాణాలు పోతున్నా పట్టించుకోడం లేదంటూ అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కో-ఆప్షన్ సభ్యులు గుళ్ల సుబ్బారావు, మొగలి జయబాబు మాట్లాడుతూ నగర పంచాయతీలో ఎక్కడా లైట్లు వెలగడం లేదని, వర్షం వస్తే గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సమావేశంలోనే రూ.4 లక్షలు కేటాయించినట్టు చెప్పారని, ఇప్పటికీ నెల గడిచినప్పటికీ ఎక్కడా లైట్లు వెలగడం లేదన్నారు. దీనిపై ఏఈ ప్రభాకర్ స్పందిస్తూ, టెక్నికల్ శాంక్షన్‌కు పంపామని, రేట్ల తేడాతో ఫైల్ వెనక్కి వచ్చిందని, కాంట్రాక్టర్లు కూడా పనులు చేయలేదని సమాధానమిచ్చారు. అంతలో 17వ వార్డు కౌన్సిలర్ శ్రీరామచంద్రమూర్తి కలగజేసుకుని, నామినేషన్ పద్ధతిలో అయినా లైట్లు వెంటనే వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 11వ వార్డు కౌన్సిలర్ కూరాకుల, మొగలి జయబాబు మాట్లాడుతూ, మనుషుల కంటే కుక్కలు అధికంగా ఉన్నాయని, ప్రజలపై దాడులు చేస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 12వ వార్డు కౌన్సిలర్ సుబ్బారావు 11వ వార్డు కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ, ఖర్చులు భారీగా చూపిస్తున్నారని, నీళ్లు మాత్రం మురికిగా వస్తున్నాయంటూ మండిపడ్డారు. ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ వేసవిలో సమర్థంగా తాగునీరు అందజేశామని, వార్డుల్లో నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 12వ వార్డు కౌన్సిలర్ సుబ్బారావు మాట్లాడుతూ చేపల చెరువులు లీజును పునరుద్ధరిస్తున్నారా, లేదా అని ప్రశ్నించారు. దీనిపై మొగలి జయబాబు మాట్లాడుతూ చెరువు లీజు పునరుద్ధరిస్తే, అక్కడ నివాసం ఉండలేకపోతున్నారని, చెరువులో వచ్చే దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ గంధం నాగేశ్వరరావు, కమిషనర్ రవికుమార్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెండింగ్‌లో 1,400 ఎన్టీఆర్ ఇళ్ల బిల్లులు

- హౌసింగ్ పీడీ సత్యనారాయణ



సామర్లకోట మండలం జి.మేడపాడులో ఇంటిని సర్వే చేస్తున్న పీడీ, ఎంపీడీఓ

సామర్లకోట: మండలంలో 1,400 ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు చెల్లించవలసి ఉందని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టరు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. జి.మేడపాడులో గృహాల బిల్లులపై సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2017 నుంచి 2019 వరకు ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. అప్పటి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్టు చెప్పారు. సర్వే చేసి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతాయన్నారు. వంద రోజుల నిర్దేశిత లక్ష్యంలోగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. హౌసింగ్ ఇంజినీరు వై శ్రీనివాసు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల ఇంజినీరు మహమ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం



జలమయమైన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు రోజులుగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనదారులు, ప్రయాణికులు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాలలో రోడ్లు కాలువలను తలపించాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లను ఆక్రమించి, షాపులను ఏర్పాటు చేయడంతో, వర్షపు నీరు పారడం లేదు. దీంతో మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. వాకతిప్ప పోలీస్ స్టేషన్ ఎదురుగా, కొండెవరంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కుతుకుడుమిల్లి, కొత్తపల్లిలో డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో, రోడ్లపై గంటల తరబడి వర్షంనీరు నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనం కారణంగా తీర ప్రాంతంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

చెట్ల ప్రయోజనాలు తెలుసుకోవాలి

సామర్లకోట: చెట్ల వల్ల ఎంత ప్రయోజనం ఉంటుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంఈఓ-2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. వివిధ శుభ సందర్భాల్లో మొక్కలు నాటే సంప్రదాయాన్ని చేపట్టాలన్నారు. మొక్కలు లేకపోతే జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాట్యారు. మొక్కలు నాటుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కను నాటిన ఎంఈఓ-2 పుల్లయ్య

దేవుణ్ణి చేసిన మనిషి



రుద్రాక్షలతో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న వీరబాబు



వరి పిండి వినాయక విగ్రహం



పసుపుతో చేసిన గణపతి విగ్రహం

- పర్యావరణ పరిరక్షణకు తాపీ మేస్త్రీ చేయూత
- వినూత్న తరహాలో వినాయక విగ్రహాల తయారీ
- మన్ననలు అందుకుంటున్న రూప శిల్పి వీరబాబు

పిఠాపురం: వినాయక చవితి వస్తుందంటే గ్రామగ్రామాన, వీధి వీధిలోను వినాయక మంటపాలు వెలుస్తుంటాయి. ఒకరిపై ఒకరు పోటీగా రంగురంగుల భారీ నుంచి అతి భారీ విగ్రహాల మంటపాలు ఏర్పాటు చేస్తుంటారు. వీటిలో ఎక్కువగా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టరాఫ్ పారిస్ విగ్రహాలే ఉంటాయి. వాటి వల్ల కలిగే నష్టాలు పర్యావరణానికి కలిగే ఇబ్బందులు ప్రజలకు తెలియజేయాలన్న సత్సంకల్పంతో వినూత్న వినాయక విగ్రహాల తయారీకి పూనుకున్నారు గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ కోలా వీరబాబు. ఇంటి నిర్మాణ పనుల్లో నేర్చుకున్న మెళకువలను ఉపయోగించి, కేవలం తన చేతితో ఎటువంటి పర్యావరణ కాలుష్యం లేని విధంగా విగ్రహాలు తయారు చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.

ఏటా ఒక్కో రకమైన వినాయక విగ్రహాన్ని వీరబాబు తయారు చేస్తారు. గతంలో 45 కిలోల వరి పిండితో మూడున్నర అడుగుల వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. 30 కేజీల పసుపుతో మరో విగ్రహాన్ని తయారు చేసిన వీరబాబు.. ఈ ఏడాది రుద్రాక్షలతో వినాయకుడి విగ్రహాన్ని రూపొందించారు. సుమారు ఐదు వేల రుద్రాక్షలతో నాలుగు అడుగుల వినాయకుడి విగ్రహంతో పాటు, 3 అడుగుల శివలింగాన్ని తయారు చేశారు. ఈ విగ్రహాలను రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో నెలకొల్పనున్నట్టు వీరబాబు తెలిపారు. రుద్రాక్ష విగ్రహాలను చూడడానికి స్థానికులు క్యూకడుతున్నారు.

అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే..

ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే ఏటా పర్యావరణానికి హాని చేయని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాను. నేను చేసే వరి పిండి, పసుపు, రుద్రాక్షలు వంటివి పర్యావరణానికి ఎటువంటి హాని చేయవు. వీటిని పూజల అనంతరం ఉపయోగించుకునే అవకాశం కూడా ఉంది. ఆకర్షణ కోసం రంగుల పేపర్లతో అలంకరణ చేస్తుంటాను. వీటి తయారీని చూసి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో పసుపు, కుంకుమ, వరి పిండి తదితర వాటితో వినాయక ప్రతిమలు తయారు చేసుకుని పూజించుకోవచ్చు. నేను తయారు చేసిన విగ్రహాలను మా వీధిలో వినాయక మండపంలో ఉంచి, నవ రాత్రులు పూజలు చేస్తుంటాం. విగ్రహాలు చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

– కోలా వీరబాబు, తాపీ మేస్త్రీ, గొల్లప్రోలు

ప్రభుత్వ భూముల్లో నాట్లు!

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు ఆనందనగర్ సమీపంలో ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం భూమిని సేకరించింది.. కాకినాడ అర్బన్‌కు సంబంధించి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు 71 ఎకరాలను సేకరించారు. సుమారు 32 ఎకరాల భూమిని లెవెలింగ్ చేశారు. మిగిలిన 39 ఎకరాలు వరి భూమిగానే మిగిలింది. ఈ భూమిపై కొంతమంది భూ భకాసురుల కన్ను పడింది. రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో, వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 39 ఎకరాల ప్రభుత్వ భూమిని.. ఎకరానికి సుమారు రూ.30 వేల చొప్పున కౌలుకు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి పలివెల కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ భూమిలో నాట్లు వేయడం వాస్తవమేనని చెప్పారు. నాట్లు వేసిన వారికి హెచ్చరికలను జారీ చేశామని, ఈ విషయాన్ని సంబంధిత జిల్లా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు పొలంలో గడ్డి మందు పిచికారీ చేయించి, దమ్ము చేయిస్తామని చెప్పారు.



కొమరగిరి శివారు ఆనంద్ నగర్‌లోని ప్రభుత్వ భూమిలో వేసిన వరి నాట్లు